పల్లె చిన్న.. ప్రగతిలో మిన్న

- అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న రసూలాబాద్
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చొరవతో మౌలిక వసతుల కల్పన
- గ్రామంలో అన్నివీధుల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ
- ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మాణం
- ఆకట్టుకుంటున్న కమ్యూనిటీ ఇంకుడు గుంతలు
- తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన గ్రామ పంచాయతీ భవనం

కొమురవెల్లి, అక్టోబర్ 24 : గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. సీఎం కేసీఆర్ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం మధిర గ్రామాలు, తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఐనాపూర్ మధిర గ్రామంగా ఉన్న రసూలాబాద్‌ను నూతన గ్రామ పంచాయతీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తీసుకువెళ్లిన ఎన్నో ఏండ్ల గ్రామస్తుల కలను సాకారం చేశారు. 2018 ఆగస్టు 2న నూతన గ్రామపంచాయతీగా రసూలాబాద్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రసూలాబాద్ సమగ్ర వివరాలు..

నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన రసూలాబాద్‌లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సూచన మేరకు 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పచ్చిమండ్ల స్వామిగౌడ్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐనాపూర్ నుంచి విడిపోయిన రసూలాబాద్ గ్రామంలో 8 వార్డులు ఉన్నాయి. మొత్తం జనాభా 768 మంది కాగా, అందులో స్త్రీలు 389 మంది, పురుషులు 379 మంది ఉన్నారు. అదేవిధంగా మొత్తం ఓట్లు 452 ఉండగా, అందులో స్త్రీలు 229 మంది, పురుషులు 223 మంది ఉన్నారు. నూతనంగా ఏర్పడిన తమ గ్రామంలో వసతులు ఎలా ఉంటాయో అనుకున్నారు గ్రామస్తులు. సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.25 లక్షల నిధులు ఇస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అంతకుమించి గ్రామానికి కోటికి పైగా నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ పచ్చిమండ్ల స్వామిగౌడ్ నిరంతర కృషితో

పూర్తయిన అంగన్‌వాడీ భవనం

రసూలాబాద్ గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతున్నది.

అభివృద్ధిలో ఆదర్శం..

నూతనంగా గ్రామ పంచాయతీగా ఏర్పడిన రసూలాబాద్‌లో నర్సరీ, పల్లెపకృతి వనం, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలు నిర్మించారు. అంతకుముందే ప్రధానంగా ఉన్న డ్రైనేజీలో మట్టి పైపులు ఏర్పాటు చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేయడంతోపాటు పైపులను ఎర్ర మట్టితో పూడ్చివేసి అందులో పూల మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించడంతోపాటు ప్రధాన అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి గ్రామ శివారులో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామంలో విషజ్వరాలు తగ్గాయి.

శరవేగంగా అభివృద్ధి పనులు..

రసూలాబాద్ గ్రామం ఏర్పాటైన 4 ఏండ్ల వ్యవధిలో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఫిబ్రవరి 16న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనతోపాటు రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేయగా, శరవేగంగా పనులు పూర్తి కావడంతోపాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

గ్రామంలో అన్ని సౌలత్‌లు సమకూరాయి..

గతంలో ఏమైనా పనులు కావాలంటే ఐనాపూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో ఒక రోజే పని మాని అక్కడికి పోయే టోళ్లం. తెలంగాణ ప్రభుత్వం మా ఊరును నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. ఎమ్మెలే ముత్తిరెడ్డి మా గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. గ్రామంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రామంలో రోడ్లు సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఇంట్లోకే మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. మా ఊర్లో అన్ని సౌలత్‌లు సమకూరాయి.

– అన్నబోయిన నర్సమ్మ, రసూలాబాద్

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

ఇంత త్వరగా మా గ్రామం అభివృద్ధి అయిత దానుకోలేదు. మొదట్లో తాత్కాలికంగా గ్రామ పంచాయతీ భవనం ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పుడు అన్ని శాశ్వత భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గ్రామ పంచాయతీ ఏర్పడింది కానీ, ఊరు ఒక రూపానికి రావాలంటే ఎన్నేండ్లు పడుతుందో అనుకునేవాళ్లం. చూస్తుండగానే అన్ని అభివృద్ధి పనులు చకచకా సాగిపోయాయి. రసూలాబాద్ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేసి మా చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– ఎండీ అబ్దుల్లా, రసూలాబాద్

పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కు

రహదారికి ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు

మంత్రి హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు

మంత్రి హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 24 : దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం మంత్రి హరీశ్‌రావును గజ్వేల్ ప్రజాప్రతినిధులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు, నాచారం ఆలయ మాజీ చైర్మన్ యాదగిరి ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గమ్మ గుడికి విరాళాలు అందజేత

దుర్గమ్మ గుడికి విరాళం అందజేస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

అక్కన్నపేట, అక్టోబర్ 24 : మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న దుర్గమ్మ గుడికి గ్రామస్తులు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. మంగళవారం అక్కన్నపేటకు చెందిన నార్లపురం శ్రీనివాస్ రూ.15,116, నార్లపురం రాజు రూ.10,116, సూరం రంజిత్‌రెడ్డి రూ.20,116 నగదును సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డికి విరాళంగా అందజేశారు. అనంతరం విరాళాలు అందజేసిన దాతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కాశబోయిన ఎల్లయ్య, చింతల మల్లారెడ్డి, జాగీరు దేవేందర్, కనకారెడ్డి, ఎలసాని వెంకటయ్య, నక్క బాలయ్య, చిట్యాల కొమురయ్య, ఉపేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

చేర్యాల, అక్టోబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని ఉల్లెంగుల సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ ఉల్లేంగుల ఏకానందం అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దరాజుపేటకు చెందిన యువకులకు ఏకానందం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడంతోపాటు క్రీడాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో యువతకు సహకారం అందిస్తానన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

హుస్నాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కిరణ్ తదితరులు

హుస్నాబాద్, అక్టోబర్ 24 : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాతోపాటు పలు ప్రధాన కూడళ్లలో మంగళవారం సీఐ ఎర్రల కిరణ్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. హనుమకొండ–సిద్దిపేట రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల్లో డబ్బు, మద్యం తరలించే అవకాశం ఉన్నందున కేంద్ర ప్రత్యేక బలగాల సహకారంతో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మిరుదొడ్డి, అక్టోబర్ 24 : బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కాసులాబాద్ గ్రామానికి చెందిన బిట్ల మణెమ్మ–రత్నం దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు బిట్ల జానుప్రసాద్(28) సిద్దిపేటలోని ఏరియా దవాఖానలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 23న దసరా పండుగ రోజు ఉదయం 3 గంటల సమయంలో విధులకు హాజరయ్యేందుకు కాసులాబాద్‌లోని తన ఇంటి నుంచి సిద్దిపేటకు పల్సర్ బైక్‌పై బయల్దేరాడు. ధర్మారం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టడంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వాకింగ్‌కు వచ్చిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

దుబ్బాక, అక్టోబర్ 24 : బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దుబ్బాకలో బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల, బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. దుబ్బాకలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు మంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

నేడు అక్కన్నపేట మండలంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

అక్కన్నపేట, అక్టోబర్ 24 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గండిపల్లి, పంచరాయి తండా, అంబ తండా, డాక్యా తండా, సరిరాం తండా, రామవరం, బంగారులొద్ది తండా, చౌటకుంట తండా, కుందన్‌వానిపల్లి, మైసమ్మవాగు తండా, మబ్బుకుంట, బొడిగపల్లి, గౌరవెల్లి, కెప్టెన్‌కాలనీ, జనగామలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచార సభ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ఈనెల 30 నుంచి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం..

కోహెడ, అక్టోబర్ 24 : ఈనెల 30 నుంచి కోహెడ మండలంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి తెలిపారు. మంగళవారం కోహెడలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సురేశ్, శ్రీకాంత్, లక్ష్మణ్, పరశురాములుగౌడ్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.